




# వార్త మిర్రర్

తెలుగు దినపత్రిక

సోమవారం,
జూన్ 29, 2026

సంపుటి : 10 | సంచిక :14 | రంగారెడ్డి | ఎడిటర్ బి. శ్రీధర్ యాదవ్ | పేజీలు 8 | వెల 4/-


# కాంగ్రెస్‌కు చెక్.. కార్పొరేషన్లపై చేజిక్కించుకోండి

## పార్టీ శ్రేణులకు బీజేపీ అధ్యక్షుడు నితిన్ నబిన్ పిలుపు

- జీహెచ్ఎంసీతో పాటు కీలక నగర కార్పొరేషన్లను కైవసం చేసుకోవాలి
- నిరుద్యోగులకు ఉద్యోగాల కల్పనలో రాష్ట్ర ప్రభుత్వం విఫలం
- కేంద్ర సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేర్చాలని సూచన
- బీఆర్ఎస్, కాంగ్రెస్ రెండూ ప్రజల ఆశయాలను దెబ్బతీశాయని ఆరోపణ
- ఐక్యతతో పనిచేసి నెల రోజుల్లో రాజకీయ వాతావరణాన్ని మార్చాలని పిలుపు



హైదరాబాద్: తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ప్రత్యామ్నాయంగా బీజేపీని బలోపేతం చేయడమే వచ్చే రెండున్నరేళ్ల ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ స్పష్టం చేశారు. అధికార పార్టీపై ప్రజల్లో వ్యతిరేకతను పెంచుతూ ప్రతి స్థాయిలో పోరాటాలు నిర్వహించాలని పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులకు సూచించారు. రాబోయే అన్ని ఎన్నికల్లో విజయాన్ని లక్ష్యంగా పెట్టుకుని క్షేత్రస్థాయిలో కార్యాచరణ చేపట్టాలని పిలుపునిచ్చారు. పట్టణ ప్రాంతాల్లో పార్టీ బలం పెంచేందుకు జీహెచ్ఎంసీ, సైబరాబాద్, మల్కాజ్‌గిరి, వరంగల్, ఖమ్మం తదితర మున్సిపల్ కార్పొరేషన్లలో విజయమే ప్రధాన లక్ష్యంగా పనిచేయాలని దిశానిర్దేశం చేశారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రతి గడపకూ చేర్చుతూ ప్రజల్లో విశ్వాసం పెంచాలని సూచించారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు, ఉపాధి కల్పించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని నితిన్ నబిన్ విమర్శించారు. ఈ అంశంపై యువమోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలు చేపట్టి విద్యార్థులు, యువతను చైతన్యపరచాలని చెప్పారు. తెలంగాణ సాధనలో బీజేపీ కీలక పాత్ర పోషించినప్పటికీ, అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రజల ఆకాంక్షలను

(మిగతా 2వ పేజీలో)



# మూసీ ప్రక్షాళన ఆగదు!

## మూసీని దేశానికే ఆదర్శంగా తీర్చిదిద్దుతాం: సీఎం రేవంత్

- రాష్ట్ర అభివృద్ధిపై శాసనసభలో బహిరంగ చర్చకు ప్రతిపక్షాలకు సవాల్
- 13,006 కోట్లతో 6,092 కి.మీ. రహదారుల నిర్మాణానికి శ్రీకారం
- ఎస్ఎల్‌బీసీ, డిండి పూర్తి చేసి నల్గొండకు సాగు, తాగునీరు హామీ
- ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ప్రజలే తీర్పు చెబుతారని వ్యాఖ్య
- 2034 వరకూ కాంగ్రెస్ జెండానే ఎగురుతుందని ధీమా

నల్గొండ/హైదరాబాద్: మూసీ ప్రక్షాళన విషయంలో ఎలాంటి ఆటంకాలు వచ్చినా వెనక్కి తగ్గేది లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. మూసీని దేశానికి ఆదర్శంగా నిలిచేలా అభివృద్ధి చేస్తామని, కాలుష్యంతో ఇబ్బందులు పడుతున్న నల్గొండ ప్రజలకు శాశ్వత పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు. రాష్ట్రవ్యాప్తంగా రూ.13,006 కోట్లతో 6,092 కిలోమీటర్ల మేర చేపట్టనున్న 441 హ్యామ్ రహదారుల నిర్మాణ పనులకు ఆదివారం నల్గొండ జిల్లా కనగల్‌లో శంకుస్థాపన చేసిన అనంతరం జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. నల్గొండలో రూ.83 కోట్ల తాగునీటి పథకానికీ భూమిపూజ చేశారు. భారాస నాయకులు మళ్లీ అధికారంలోకి రావాలని ప్రజలు

(మిగతా 2వ పేజీలో)

## ఆ టైటిల్‌కు అర్థం ఏమిటో పవన్‌ను అడగండి: కవిత



- 'ఇడుపు కాయితం' టైటిల్‌పై రాజుకున్న వివాదం
- అర్థం తెలియాలంటే పవన్‌ను అడగాలన్న కవిత
- తెలంగాణ యాసను రేవంత్ కాపాడటం లేదని విమర్శ
- ఉప్పల్‌లో జూలై 2న భూపోరాటానికి పిలుపు
- తెలంగాణ అస్తిత్వంపై దాడి జరుగుతోందని ఆవేదన

## హనుమకొండలో ఘోర రోడ్డు ప్రమాదం.. ఇంట్లోకి దూసుకెళ్లిన కారు, ఒకరి మృతి




- కమలాపూర్ మండలం ఉప్పల్ గ్రామ సమీపంలో ఘటన
- ముగ్గురికి తీవ్ర గాయాలు, పరిస్థితి విషమం
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు

## ఇళ్ల కొనుగోళ్లలో ముందున్న బెంగళూరు, హైదరాబాద్.. ఢిల్లీలో తగ్గిన అమ్మకాలు

- దేశంలో భారీగా పెరిగిన ఇళ్ల అమ్మకాలు
- ఏప్రిల్-జూన్ త్రైమాసికంలో 19 శాతం వృద్ధి నమోదు
- కొత్త ప్రాజెక్టుల ప్రారంభంలో 43 శాతం పెరుగుదల
- అమ్మకాల్లో బెంగళూరు, హైదరాబాద్, పుణె హవా
- ప్రాప్‌ఈక్విటీ నివేదికలో వెల్లడైన కీలక గణాంకాలు



# విజయవాడ ఎంపీ కేశినేని చిన్నిపై నాని సంచలన ఆరోపణలు

- సీఎం రేవంత్‌కు ఫిర్యాదు
- హైదరాబాద్‌లో వేల కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు యత్నమంటూ ఆరోపణ
- తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాసిన కేశినేని నాని
- భూకబ్జాను అడ్డుకుని, చిన్నిపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని డిమాండ్
- ఈడీ, ఎన్‌సీఎల్‌టీ ఆదేశాలను దాచిపెట్టి మోసానికి పాల్పడుతున్నారని ఆరోపణ



హైదరాబాద్: విజయవాడ రాజకీయాలు మరోసారి వేడెక్కాయి. మాజీ ఎంపీ, వైసీపీ నేత కేశినేని నాని.. తన సోదరుడు, ప్రస్తుత విజయవాడ టీడీపీ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) లక్ష్యంగా సంచలన ఆరోపణలు చేశారు. హైదరాబాద్ శివార్లలోని వేల కోట్ల రూపాయల విలువైన ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు చిన్ని ప్రయత్నిస్తున్నారని ఆరోపిస్తూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి సోషల్ మీడియా వేదికగా ఒక బహిరంగ లేఖ రాశారు. ఈ భూకబ్జా యత్నాన్ని తక్షణమే అడ్డుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్ నగర శివారులోని ప్రగతి నగర్, షంషిగూడ ప్రాంతంలో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థకు (టీజీఐఐసీ) చెందిన 112.72 ఎకరాల భూమి ఉంది. దీనిని ఐటీ పార్క్ కోసం కేటాయించారు. అయితే, ఈ అత్యంత విలువైన ప్రభుత్వ భూమిని ఎంపీ కేశినేని చిన్ని, ఆయన బినామీగా వ్యవహరిస్తున్న మెసర్స్ ఎక్సెల్లా ప్రాపర్టీస్ అనే సంస్థ అక్రమంగా

(మిగతా 2వ పేజీలో)



# బంగారం కొనుగోళ్లు తగ్గించారు

## ప్రజలకు మోదీ ధన్యవాదాలు


- బంగారం కొనుగోళ్లు, ఇంధన వాడకం తగ్గించినందుకు ప్రజలకు మోదీ ధన్యవాదాలు
- పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రధాని చేసిన విజ్ఞప్తికి అద్భుత స్పందన
- సీషెల్స్ పర్యటన నుంచే 135వ మన్ కీ బాత్‌లో ప్రసంగించిన ప్రధాని

పశ్చిమాసియాలో నెలకొన్న యుద్ధ వాతావరణం దృష్ట్యా తాను చేసిన విజ్ఞప్తికి స్పందించి, బంగారు కొనుగోళ్లు తగ్గించడంతో పాటు ఇంధనాన్ని పొదుపు చేసిన భారతీయులకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. ఆదివారం ప్రసారమైన 135వ 'మన్ కీ బాత్' రేడియో కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. అంతర్జాతీయ సంక్షోభ సమయంలో ప్రజలు కనబరిచిన ఈ సహకారం దేశ ఐక్యతకు, శక్తికి నిదర్శనమని కొనియాడారు. ప్రస్తుతం సీషెల్స్ పర్యటనలో ఉన్న ప్రధాని, అక్కడి నుండే ఈ కార్యక్రమం ద్వారా దేశప్రజలను

(మిగతా 2వ పేజీలో)

# మళ్లీ చర్చల బాట పట్టిన యుఎస్-ఇరాన్ ఇరు దేశాలు దాడుల నిలిపివేత

- పశ్చిమాసియాలో తాత్కాలికంగా తగ్గిన అమెరికా-ఇరాన్ ఉద్రిక్తతలు
- వివాద పరిష్కారానికి దోహాలో రేపు ఇరు దేశాల సాంకేతిక చర్చలు
- 11 రోజుల ఒప్పందం విఫలమవడంతో పెరిగిన ఘర్షణలు
- సైన్యాల మధ్య ఘర్షణల నివారణకు హాట్‌లైన్ ఏర్పాటుపై దృష్టి
- దాడులు ఆగిపోవడంతో హర్మూజ్ జలసంధిలో సాధారణ స్థితి



పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతలకు కారణమైన అమెరికా-ఇరాన్ వివాదం తాత్కాలికంగా సద్దుమణిగింది. ఒకరిపై ఒకరు సైనిక దాడులు నిలిపివేయాలని ఇరు దేశాలు నిర్ణయించుకున్నాయి. ప్రపంచ ఇంధన రవాణాకు కీలకమైన హర్మూజ్ జలసంధిలో నౌకల రాకపోకలపై తలెత్తిన వివాదాన్ని పరిష్కరించుకునేందుకు మంగళవారం(30న) ఖతార్ రాజధాని దోహాలో అత్యవసర సాంకేతిక చర్చలు జరపనున్నట్లు అమెరికా అధికారులు ధ్రువీకరించారు. జూన్ 17న కుదిరిన ఒప్పందం 11 రోజుల్లోనే విఫలమవడంతో ఈ కొత్త దౌత్య ప్రయత్నాలు తెరపైకి వచ్చాయి. ఆ ఒప్పందం ప్రకారం, ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకాదళ దిగ్బంధనాన్ని ఎత్తివేయాలి. బదులుగా హర్మూజ్ జలసంధిలో అంతర్జాతీయ వాణిజ్య నౌకలకు ఇరాన్ భద్రత కల్పించాలి. అయితే, జలసంధి దాటే నౌకలు తమ అనుమతి తీసుకోవాలని ఇరాన్ పట్టుబట్టడం,

(మిగతా 2వ పేజీలో)

# 7 హిల్స్ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక

### అధ్యక్షులుగా కత్తుల రాంబాబు ఏకగ్రీవ ఎన్నిక






వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో మనసురాబాద్ డివిజన్ సెవెన్ హిల్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నుకోబడింది అధ్యక్షులు కత్తుల రాంబాబు, సెక్రెటరీ కిషోర్ బాబు జాయింట్ సెక్రెటరీ బోగోజు మధు,ట్రెజరర్ శేఖర్ గౌడ్ , ఉప అధ్యక్షులు వెంకటేష్, ప్రవీణ్,సాయి కృష్ణ, సభ్యులు సరస్వతి, స్రవంతి, రమేష్, అజయ్, సతీష్, వెంకటేశ్వర్లు.మరియు కాలనీ మెంబర్స్ రామ్మోహన్, శోభన్, రాంప్రసాద్, సైదులు,కార్తీక్, పాల్గొన్నారుకత్తుల రాంబాబు మాట్లాడుతూ 2007 నుండి 2026 వరకు 19 సంవత్సరాల నుండి నా మీద నమ్మకంతో నన్ను ప్రతిసారి ఏకగ్రీవంగా ఎన్నుకున్న నా కాలనీ నాయకులకు, సభ్యులకు అందరికీ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు

# రెండు దశాబ్దాలుగా కాలనీకి నిస్వార్థంగా సేవ చేయడం హర్షణియం- గుండగోని మధు గౌడ్

### దశాబ్దాలుగా అందరికీ ఆదర్శంగా నిలిచే సహాయక కార్యక్రమాల్లో మీ నిరంతర కృషి మరువలేనిది.!



వార్త మిర్రర్ తెలంగాణ స్టేట్ బ్యూరో

మనసురాబాద్ డివిజన్ సెవెన్ హిల్స్ రెసిడెన్సి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఎన్నికైన కత్తుల రాంబాబు ను తెలంగాణ రాష్ట్ర బిసి యువజన విద్యార్థి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుండగోని మధు గౌడ్ కత్తుల రాంబాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భాగ్యనగరం చరిత్రలో ఎక్కడ లేని విధంగా ఒక కాలనీకి రెండు దశాబ్దాలుగా 19 సంవత్సరాలుగా పలుమార్లు ఏకగ్రీవంగా ఎన్నిక కావడం కత్తుల రాంబాబు కే సాధ్యమని అన్నారు. కాలనీకే కాదు మనసురాబాద్ డివిజన్ లోని అనేక కాలనీలలో నిస్వార్థంగా సేవ చేయడం, కాలనీ అభివృద్ధికి, సంక్షేమానికి వారు చేసిన సేవలను ప్రజలు గుర్తించారని తెలిపారు. కత్తుల రాంబాబు సంఘ సేవలో ఆదర్శంగా నిలిచేవారని వారి స్ఫూర్తిదాయకమైన ఆలోచనలతో ఎన్నో కార్యక్రమాలు చేపడతాడని వారిని కొనియాడారు, మనసురాబాద్ డివిజన్ లో ఎన్నో కాలనీలలో డ్రైనేజీ వ్యవస్థ, రోడ్ల నిర్మాణం, వీధి దీపాల ఏర్పాటుకు కృషి, తాగునీరు, నీటి సమస్యలు లేకుండా పచ్చదనం, పార్కుల అభివృద్ధి, మొక్కలు నాటడం పర్యావరణ పరిరక్షణ సామాజిక సేవలు ,పేదలకు సహాయం, పండుగలు మరియు కాలనీ వేడుకలను అందరిని కలుపుకొని జరుపుకునేలా ఐక్యతను పెంపొందించడం, కాలనీ అభివృద్ధి మరియు సంఘ సేవలు ఆదర్శంగా నిలిచేవారని వారిని కొనియాడారు

# నేడే ఏరువాక పున్నమి: ఈ రోజు రైతులు నాగలికి ఎందుకు పూజ చేస్తారు?

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 28

రైతులు అత్యంత భక్తి శ్రద్ధలతో జరుపుకునే తొలి వ్యవసాయ పండుగ- ఏరువాక పున్నమి విశిష్టత, వేద-పురాణ ప్రస్తావనలు, రైతులు ఆచరించే సంప్రదాయాలు- ఏమిటో మీకు తెలుసా?హిందూ సంప్రదాయంలో ప్రతి పండుగ ప్రకృతి ఆధారంగానే ఏర్పడుతాయి. ప్రకృతిని పూజించమని సందేశాన్ని అందిస్తాయి. మన భారతదేశం వ్యవసాయ ఆధారిత దేశం. అందుకే మన సనాతన ధర్మం ప్రకృతిని పూజించమని, ప్రకృతిని రక్షించమని బోధిస్తుంది. మండే ఎండల వేసవితో గ్రీష్మతాపం పెంచే రోహిణి కార్తె పూర్తికాగానే వచ్చే మృగశిర కార్తెలో కురిసే వర్షాలపైనే రైతులు ఆధారపడతారు. ఈ క్రమంలో మృగశిర కార్తెలో వచ్చే పౌర్ణమిని ఏరువాక పౌర్ణమిగా రైతులు జరుపుకుంటారు. ఈ సందర్భంగా ఏరువాక పున్నమి అంటే ఏంటి, ఈ రోజు రైతులు ఎలా జరుపుకుంటారు అనే విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.



## ఏరువాక పున్నమి అంటే?

ఏరువాక పౌర్ణమి అనేది తెలుగు రాష్ట్రాల్లోని రైతులు వైభవంగా జరుపుకునే తొలి వ్యవసాయ పండుగ. వర్ష రుతువు ప్రారంభాన్ని, తొలకరి జల్లులను ఆహ్వానిస్తూ జ్యేష్ఠ మాసంలో వచ్చే పౌర్ణమి నాడు దీన్ని జరుపుకుంటారు. ఈ ఏడాది జూన్ 29, సోమవారం జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమిని ఏరువాక పున్నమిగా జరుపుకోవాలని పండితులు చెబుతున్నారు. 'ఏరు' అంటే నాగలి, 'ఏరువాక' అంటే దున్నడానికి సిద్ధం చేయడం అని అర్థం. ఏరువాక పున్నమి రోజున రైతులు తొలకరి జల్లులు పడగానే భూమిని పూజించి, ఆ సంవత్సరం వ్యవసాయ పనులను లాంఛనంగా ప్రారంభిస్తారు.

## ఓషధి తత్వం

ఓషధులకు, సస్యానికి అధిపతి అయిన చంద్రుడు జ్యేష్ఠ నక్షత్రానికి చేరువలో ఉన్న తరుణంలో ఏరువాక పూర్ణిమతో శుభ ఫలితాలను అందిస్తాడని విశ్వాసం. అందుకే జ్యేష్ఠ పూర్ణిమ నాడు మొదటిసారి పొలాన్ని దున్నుతారు. ఏరువాక పూర్ణిమను సీతాయజ్ఞం అని సంస్కృతంలో ఉద్వృషభ యజ్ఞం అని, కన్నడంలో కారణి పబ్బం అని జరుపుకుంటారు. వేదం వర్ణించిన ఏరువాక

వేద కాలంలో అందరూ ప్రతి పనిని యజ్ఞంగానే భావించేవారు. ప్రాచీనకాలం నుంచి జ్యేష్ఠ పూర్ణిమను ఏరువాక పూర్ణిమగా వ్యవహరిస్తున్నారు. అధర్వవేదం ఏరువాకను 'అనడుత్సవం'గా చెప్పింది. క్షేత్రపాలకుని మంత్రాలతో స్తుతించి నాగలితో భూమిని దున్ని విత్తనాన్ని చల్లడం వంటి పద్ధతులను ఆచరించేవారు. ఆ తర్వాతి కాలంలో పరాశరుడు, బోధాయనుడు మొదలైన మహర్షులు తమ గుహ్య సూత్రాల్లో ఈ పండుగ గురించి ప్రస్తావించారు.

## పురాణాలలో ఏరువాక ప్రస్తావన

విష్ణు పురాణంలో ఏరువాకను సీతా యజ్ఞంగా ప్రస్తావించడం జరిగింది. ఇందులో సీత అంటే నాగలి అని అర్థం. 'వప్ప మంగళ దివసం', 'బీజవాపన మంగళ దివసం', 'వాహణ పుణ్ణాహ మంగళమ్', 'కర్షణ పుణ్యాహ మంగళమ్,' అనే పేర్లతో ఈ పండుగను వైభవంగా జరుపుకునేవారని విష్ణు పురాణం వివరిస్తోంది. శుద్ధోదన మహారాజు ఆనాడు కపిలవస్తులో లాంఛనంగా ఈ ఏరువాకను ప్రారంభిస్తూ బంగారు నాగలిని కర్షకులకు అందించినట్లుగా శాస్త్రాలలో వివరించబడింది. హాలుడు రాసిన గాథాసప్తశతిలో కూడా ఏరువాక గురించి అనేక కథలు ప్రాచుర్యంలో ఉన్నాయి. ఏరువాక పండుగ తెలుగు పండుగల్లో సాహిత్యధారాలున్న కొన్ని వేల సంవత్సరాల అతి ప్రాచీన పండుగ.

## ఏరువాక సాగారో

'ఏరువాక సాగారో!' అంటూ మన తెలుగు కవులు కూడా ఏరువాక గొప్పతనం గురించి తమ పాటలలో వర్ణించారు. ఏరువాక అంటే వ్యవసాయం మొదలు పెట్టడం. సాంప్రదాయికంగా రైతులు ఏరువాక పున్నమిని పండుగలా జరుపుకుంటారు. ఆ రోజు ఎద్దులను కడిగి చక్కగా అలంకరిస్తారు. వాటికి హారతులు ఇచ్చి పొంగలి పెడుతారు. అనంతరం రైతులందరూ సామూహికంగా ఎద్దులను తోలుకుని పొలాలకు వెళ్లి దుక్కి దున్నుతారు.

## పుట్టిల్లు చేరే ఆడపడుచులు

ఏరువాక పున్నమి రోజున ఆడపడుచులు పుట్టింటికి వస్తారు. ఈ పండుగనాడు చేసే మరో ముఖ్యమైన వేడుక ఎడ్ల పందేలు. ఎద్దులను బాగా అలంకరించి పరిగెత్తిస్తారు. వాటి వెనుక యువకులు పరుగులు తీస్తారు. అంతేకాకుండా ఎద్దులకు బరువైన బండ రాళ్లు కట్టి పరుగులు తీయిస్తారు. దీన్ని బండలాగుడు పోటీ అంటారు. పాలెగాళ్లకు కొత్త సంవత్సరం

ఏరువాక పౌర్ణమి రోజునే ఇళ్లలో పనిచేసే జీతగాళ్లకు పాత సంవత్సరం ముగిసి కొత్త సంవత్సరం మొదలవుతుంది.

## ఏరువాక పండుగ ఎందుకు చేస్తారు?

కొత్త వ్యవసాయ సంవత్సరంలో వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని, భూమి సస్యశ్యామలంగా ఉండాలని రైతులు వర్షాధిపతి అయిన ఇంద్రుని, భూమాతను ప్రార్థిస్తూ జరుపుకునే పండుగే ఏరువాక పున్నమి. ఈ ఏరువాక పున్నమి రోజు రైతుల తరఫున మనం కూడా వర్షాలు బాగా కురిసి, పంటలు బాగా పండాలని, దేశం సుభిక్షంగా ఉండాలని కోరుకుందాం. మన రైతుల భక్తిబలంతో, ఆత్మవిశ్వాసంతో, శ్రమశక్తితో దేశంలో ఎల్ నినో ప్రభావం తొలగి వర్షాలు సమృద్ధిగా కురవాలని ప్రార్థిద్దాం.

**శుభం భూయాత్! జై కిసాన్!**

**తిరుమల శంకర్**



# ప్రముఖ సంతానోత్పత్తి నిపుణురాలు డాక్టర్ ప్రశాంతి రెడ్డికి జాతీయ అవార్డు

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 28

వైద్య రంగంలో విశిష్ట సేవలు అందిస్తున్న ప్రముఖ సంతానోత్పత్తి నిపుణురాలు,మదర్ హాస్పిటల్స్ (హైదరాబాద్), చౌటుప్పల్ 'ప్రశాంతి హాస్పిటల్' వ్యవస్థాపకురాలు, మెడికల్ డైరెక్టర్ డాక్టర్ ఈ. ప్రశాంతి రెడ్డి జాతీయ స్థాయిలో అరుదైన గౌరవాన్ని అందుకున్నారు.వైద్య రంగంలో ఆమె కనబరుస్తున్న అద్భుత ప్రతిభకు గానూ "ఇండియాస్ మోస్ట్ ట్రస్టెడ్ ఇవఫ్ స్పెషలిస్ట్ ఆఫ్ ది ఇయర్ -- 2026" ప్రతిష్ఠాత్మక అవార్డు వరించింది. ?హైదరాబాద్‌లోని ది పార్క్ హోటల్లో ఘనంగా నిర్వహించిన 'ప్రైడ్ ఆఫ్ హెల్త్‌కేర్ ఎక్సలెన్స్ అవార్డ్స్ ౘ సమ్మిట్-- 2026' కార్యక్రమంలో ఆమెకు ఈ పురస్కారాన్ని అందజేశారు. ప్రముఖ సినీ నటి, మాజీ రాజ్యసభ సభ్యురాలు జయప్రద ముఖ్య అతిథిగా హాజరై డాక్టర్ ప్రశాంతి రెడ్డి ని శాలువాతో సత్కరించి, ఈ అవార్డును ప్రదానం చేశారు.?వైద్య వర్గాలు, శ్రేయోభిలాషుల అభినందనలు ?డాక్టర్ ఈ. ప్రశాంతి రెడ్డి కి జాతీయ స్థాయి అవార్డు దక్కడం పట్ల అటు హైదరాబాద్ వైద్య వర్గాలతో పాటు ఇటు చౌటుప్పల్ పట్టణ ప్రజలు, ప్రశాంతి హాస్పిటల్ సిబ్బంది, సహచర వైద్యులు, రోగులు, శ్రేయోభిలాషులు హర్షం వ్యక్తం చేశారు. ఈ అవార్డు ఆమె నిరంతర కృషికి, నిబద్ధతతో కూడిన వైద్య సేవలకు లభించిన నిజమైన గుర్తింపు అని కొనియాడారు. ఈ గౌరవం తమ బాధ్యతను మరింత పెంచిందని, భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలతో రోగులకు అండగా ఉంటామని హాస్పిటల్ ప్రతినిధులు పేర్కొన్నారు.

# అర్హులైన రైతులు ఏఈఓలను సంప్రదించాలి.. మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు వెల్లడి



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 28

చౌటుప్పల్ మండలం పరిధిలోని 18 రెవెన్యూ గ్రామాలకు చెందిన అర్హులైన రైతులు రైతు భరోసా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి (ఏఓ) ముత్యాల నాగరాజు ఒక ప్రకటనలో కోరారు.గత 15వ తేదీ నాటికి కొత్తగా పట్టాదార్ పాస్‌బుక్ పొంది, డిజిటల్ సంతకం కలిగి ఉన్న రైతులు ఈ పథకానికి అర్హులని ఆయన పేర్కొన్నారు. ?అర్హత కలిగిన రైతులు వచ్చే నెల జూలై 5వ తేదీ లోపు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణ అధికారిని ఏఈఓ సంప్రదించి దరఖాస్తు ఫారాలను అందజేయాలన్నారు. అలాగే గతంలో వివిధ కారణాల వల్ల దరఖాస్తు చేసుకోలేకపోయిన రైతులు కూడా ఇప్పుడు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన స్పష్టం చేశారు. ?కావాల్సిన పత్రాలు దరఖాస్తుతో పాటు రైతులు క్రింది జిరాక్స్ ప్రతులను జతపరచాల్సి ఉంటుంది. ?భూమి పట్టా పాస్‌బుక్ జిరాక్స్, ?ఆధార్ కార్డు జిరాక్స్, ?బ్యాంకు ఖాతా పుస్తకం జిరాక్స్, ?పూర్తిగా నింపిన రైతు భరోసా దరఖాస్తు ఫారం నిర్ణీత గడువు లోగా రైతులందరూ తమ పరిధిలోని ఏఈఓలకు ఈ పత్రాలను సమర్పించి, రైతు భరోసా పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ముత్యాల నాగరాజు సూచించారు.



# ఆరాధ్య హోటల్ ప్రారంభం.. 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్

వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 28

ఆహార పదార్థాల తయారీలో నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ, వినియోగదారుల మన్ననలు పొందాలని చౌటుప్పల్ మున్సిపాలిటీ 13వ వార్డు కౌన్సిలర్ బత్తుల వాణి విప్లవ్ కుమార్ సూచించారు. మున్సిపల్ కేంద్రంలోని 13వ వార్డు పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 'ఆరాధ్య హోటల్'ను ఆదివారం ఆమె ప్రారంభించారు.?ఈ సందర్భంగా కౌన్సిలర్ మాట్లాడుతూ.. హోటళ్లలో ఆహార పదార్థాల తయారీలో రుచితో పాటు శుభ్రతకు ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. వినియోగదారులకు నాణ్యమైన, స్వచ్ఛమైన ఆహారాన్ని అందించినప్పుడే వ్యాపారాలు విజయవంతమవుతాయని పేర్కొన్నారు. నూతన హోటల్ యజమాని సతీష్‌కు ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం హోటల్ నిర్వాహకులు కౌన్సిలర్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు.?ఈ కార్యక్రమంలో 14వ వార్డు కౌన్సిలర్లు ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, కొయ్యడ శేఖర్ గౌడ్, కో-ఆప్షన్ మెంబర్ సందగళ్ళ విజయ సతీష్ గౌడ్, మాజీ కౌన్సిలర్ పోలోజు శ్రీధర్ బాబు, కాంగ్రెస్ నాయకులు చెవగోని వెంకటేష్ గౌడ్, వర్కాల కుమార్ తదితరులు పాల్గొన్నారు..

# ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి చిన్నారికి తప్పని సరిగా పోలియో చుక్కలు వేయించాలి..

### నేలపట్ల గ్రామ సర్పంచ్ గంగాపురం వసంత నగేష్ గౌడ్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 28

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ నడుం బిగించాలని, తల్లిదండ్రులు బాధ్యతగా తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని నేలపట్ల గ్రామ సర్పంచ్ గంగాపురం వసంత నగేష్ గౌడ్ పిలుపునిచ్చారు. ఆదివారం చౌటుప్పల్ మండలం నేలపట్ల గ్రామం లోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రాన్ని ఆమె సందర్శించారు. అనంతరం చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ.. ఐదేళ్ల లోపు వయసున్న ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. పోలియో మహమ్మారిని దేశం నుండి తరిమికొట్టేందుకు ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ఈ కార్యక్రమాన్ని గ్రామంలో వంద శాతం విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుండు మల్లయ్య గౌడ్, టీడీపి పార్టీ మాజీ గ్రామ శాఖ అధ్యక్షుడు తడక కోటేశ్వర్, చౌట సంపత్ కుమార్, స్థానిక వైద్య ఆరోగ్య సిబ్బంది, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## పోలియో నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో ముఖ్యం రాగిరి మోహన్ రెడ్డి

నాచారం, జూన్ 28 వార్త మిర్రర్ :

నాచారం సర్కిల్ నాచారం డివిజన్ భవాని నగర్, గాంధీ నగర్ లో చిన్నారులకు పోలియో చుక్కలు వేసే కార్యక్రమాన్ని కాలనీల అధ్యక్షులు రాగిరి మోహన్ రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాగిరి మోహన్ రెడ్డి మాట్లాడుతూ దేశాన్ని పోలియో రహితంగా నిలబెట్టడంలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతగా తమ ఐదేళ్లలోపు పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రభుత్వం చేపడుతున్న ప్రజారోగ్య కార్యక్రమాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని ఒక్క చిన్నారి కూడా పోలియో చుక్కలు వేయించకుండా మిగిలిపోకూడదని సూచించారు. పోలియో నిర్మూలనలో ప్రజల సహకారం ఎంతో కీలకమని పేర్కొన్నారు. పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వీర ప్రతాపరెడ్డి, డి ఆనంద్, యాదగిరి, మధుసూదన్ రెడ్డి, ఎండి షాబుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో కార్యక్రమానికి అరుంధతి ఆసుపత్రి వైద్య సిబ్బందిని ఏర్పాటుచేసిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖరరెడ్డి రెడ్డి



వార్త మిర్రర్, మల్కాజిగిరి :

పల్స్ పోలియో చుక్కల కార్యక్రమం సందర్భంగా వైద్య సిబ్బంది కొరతతో, ఆశా వర్కర్లు ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణకార్యక్రమంలో నిమగ్నమైనందున ఈ విషయం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి దృష్టికి రాగా తన సొంత అరుంధతి ఆసుపత్రి నుండి వైద్య సిబ్బందిని పల్స్ పోలియో కార్యక్రమనికి ఏర్పాటు చేశారు. వైద్య సిబ్బందిని పంపిన ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి కి ఆశ కార్యకర్తలు ధన్యవాదాలు తెలిపారు. మల్కాజిగిరి డివిజన్, రాజీవ్ గాంధీ నగర్,5 సం, లోపు చిన్నారుల అందరికి పోలియో చుక్కలు కార్యక్రమం లో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్ వందేమాతరం సామాజిక భవనంలో ఏర్పాటుచేసిన శిబిరాని సందర్శించి పోలియో చుక్కల కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ కార్పొరేటర్ మాట్లాడుతూ పోలియో రహిత భారతం కోసం మన అందరి బాధ్యతగా భావించి, మన చిన్నారుల అందరికి పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రదీప్, మరియు తదితరులు పాల్గొన్నారు.



## పోలియో రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత -సర్పంచ్ ర్యాకల సంతోష- శ్రీనివాస్

యాదాద్రి వార్త మిర్రర్ ప్రతినిధి భువనగిరి మండలం తాజ్ పూర్ గ్రామంలో ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రంలో చిన్నారులకు పోలియో చుక్కలు వేసి ప్రారంభించారు సర్పంచ్ ర్యాకల సంతోష- -శ్రీనివాస్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పోలియో రహిత సమాజం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు ప్రభుత్వం నిర్వహించే పోలియో డ్రాప్స్ కార్యక్రమంలో విధిగా పాల్గొని చిన్నారులకు పోలియో బారిన పడకుండా చూసుకోవాలని తెలిపారు ఈ కార్యక్రమంలో సామాజికవేత్త డాక్టర్ ర్యాకల శ్రీనివాస్, గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు, అంగన్వాడీ టీచర్లు, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు





## చిన్నారుల ఆరోగ్యానికి జేపల్లి కృషి -- సర్పంచ్ అమినా అశోక్ రాథోడ్

కల్వకుర్తి, జూన్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:– జేపల్లి గ్రామంలో నేడు పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఐదు సంవత్సరాల లోపు చిన్నారులకు పోలియో చుక్కలు వేయించి, పోలియో రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని గ్రామ ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ అమినా అశోక్ రాథోడ్ మాట్లాడుతూ, ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించడం ద్వారా ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మించవచ్చని తెలిపారు. చిన్నారుల ఆరోగ్య పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. మాజీ సర్పంచ్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ, తల్లిదండ్రులు తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సిబ్బంది, ఆశా వర్కర్లు, ప్రశాంత్, శ్రీను, రమేష్‌తో పాటు గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు

# ఇటిక్యాల లో పెద్దమ్మ తల్లి బోనాల పండుగ....

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 28

జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో ఆదివారం రోజున గ్రామ సేవా సమితి ఆధ్వర్యంలో ముదిరాజ్ సంఘం చేతుల మీదుగా పెద్దమ్మ తల్లి బోనాల పండుగ దయాతి సుదర్శన్, విష్ణు, బృందం చే అంగరంగ వైభవంగా ఘనంగా నిర్వహించారు..గ్రామ మహిళలంతా బోనం వండుకొని నెత్తిపై పెట్టుకుని పురవీధుల గుండా డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగుతూ పెద్దమ్మ తల్లి కి తమ పిల్లలను కుటుంబ సభ్యులను చల్లగా చూడాలని బోనం ను సమర్పించి మొక్కులను చెల్లించుకున్నారు.. ఈ కార్యక్రమానికి జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ ఎం సంజయ్ కుమార్, మాజీ ఎమ్మెల్సీ టి జీవన్ రెడ్డిలు హాజరై, ప్రత్యేక పూజలు చేశారు. .అనంతరం అందరికీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ నీరటి శ్రీనివాస్, గ్రామ సేవా సమితి అధ్యక్షులు అనుపురం చిన్న లింబాద్రిగౌడ్, ఉప సర్పంచ్ నాగిరెడ్డి సాయిరెడ్డి, ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, గ్రామ వార్డు సభ్యులు, ముదిరాజ్ సంఘం అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, గ్రామ సేవ సమితి కార్యవర్గ సభ్యులు, సీనియర్ నాయకులు, మహిళలు, యువకులు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



# రాయికల్ మార్కెట్ అభివృద్ధి కి కృషి చేస్తా

### ఎమ్మెల్యే సంజయ్ కుమార్

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 28

మాదిగ కుంట ను కొంతమంది చట్టం లో లొసుగులను చూపి దోమల కుంట గా మార్చారు. అంబేద్కర్ సంఘం అభివృద్ధి కి కృషి చేస్తా ఇందిరమ్మ ఇళ్లు మంజూరు తో పేదల సొంతింటి కల సాకారం అవుతుంది. రాయికల్ డబల్ బెడ్ రూమ్ ఇండ్ల పూర్తి కి కృషి చేస్తా..రాయికల్ పట్టణ అభివృద్ధి కి అత్యధిక నిధులు మంజూరు చేశా.. రాజకీయాలు ఎన్నికల వరకే పరిమితం అభివృద్ధి నిరంతర ప్రక్రియ అని అన్నారు. అమృత్ స్కీమ్ లో 16లక్షల లీటర్ల ట్యాంక్ నిర్మాణం తో తాగు నీటి కొరత లేకుండా రాయికల్ పట్టణం. రాయికల్ పట్టణం మరింత అభివృద్ధి కి నిరంతరం కృషి చేస్తా అన్నారు..రాయికల్ పట్టణ మార్కెట్ వాడలో డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ మాదిగ సంఘం కమాన్ ను ప్రారంభించిన జగిత్యాల ఎమ్మెల్యే డా సంజయ్ కుమార్. ఈ సందర్భంగా ప్రారంభోత్సవానికి విచ్చేసిన ఎమ్మెల్యే జిల్లా కాంగ్రెస్ అధ్యక్షున్నీ సత్కరించిన అంబేద్కర్ సంఘం సభ్యులు. ఈ కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గాజెంగి నందయ్య,ఆత్మ చైర్మన్ కాటిపెల్లి గంగారెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు మచ్చ గంగలక్ష్మి,పల్లికొండ గంగాధర్, మాజీ మున్సిపల్ ఛైర్మన్ మోర హన్మండ్లు,పాక్స్ చైర్మెన్ ఏనుగు మల్లారెడ్డి,మాజీ ఏఎంసి చైర్మెన్ లు రాణి సాయి,గన్నె రాజిరెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షులు రవీందర్ రావు, అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షులు లింగంపల్లి సుభాష్, ఉపాధ్యక్షులు మారంపల్లి లక్ష్మీ నరసయ్య, ప్రధాన కార్యదర్శి దోనకంటి రాజేందర్,కోశాధికారి లింగంపల్లి భూమయ్య,సహ కార్యదర్శులు గంగాధర్, హనుమాన్లు,న్యాయవాదులు లింగంపల్లి సురేష్,అల్లే పురుషోత్తం,మచ్చ శేఖర్,



నాయకులు బాపురపు నర్సయ్య, కోల శ్రీనివాస్, మ్యకల కాంతారావు, మహేంద్ర బాబు, పాక్స్ వైస్ చైర్మన్ మోహన్ రెడ్డి, సర్పంచుల ఫోరం మోహన్, అచ్యుత్ రావు, పడిగెల నరసింహ, కొత్తపెల్లి అరవింద్, సురేష్, భీమన్న, శ్రీనివాస్, సర్పంచులు, అంబేద్కర్ సంఘం సభ్యులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

### పెద్దమ్మతల్లి బోనాల జాతరలో ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే

రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామంలో పెద్దమ్మతల్లి బోనాల జాతర కార్యక్రమంలో పాల్గొని, ప్రత్యేక పూజలు చేసిన జగిత్యాల శాసనసభ్యులు డాక్టర్ సంజయ్ కుమార్ గారు,జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు గజంగి నందయ్య.

# హిందూసామ్రాజ్యాన్ని స్థాపించిన శివాజీ స్ఫూర్తి తో యువత పని చేయాలి...

### నిజమైన చరిత్రను తెలుసుకుందాం... సంఘటితమై దేశ, ధర్మ వైభవాన్ని కాపాడుకుందాం.... ఆర్.ఎస్.ఎస్ జిల్లా సహకార్యవాహ్ సాయిమధూకర్ జీ...

వార్త మిర్రర్ రాయికల్ ప్రతినిధి జూన్ 28

జగిత్యాల జిల్లా రాయికల్ బాలికల ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం నిర్వహించిన రాయికల్ ఖండ యువ సాంఘిక కార్యక్రమం దేశభక్తి, సంస్కృతి పరిరక్షణ, జాతీయ చైతన్యానికి ప్రతీకగా ఘనంగా జరిగింది. రాయికల్ ఖండలోని వివిధ గ్రామాల నుండి పెద్ద సంఖ్యలో యువకులు గణవేష్‌లో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా ప్రధాన వక్త ఆర్.ఎస్.ఎస్ జగిత్యాల జిల్లా సహకార్యవాహ్ సాయిమధూకర్ జీ మాట్లాడుతూ భారతదేశ స్వాతంత్ర్య పోరాట చరిత్రను స్ఫూర్తిదాయకంగా వివరించారు. శివాజీ మహారాజ్ లేకుంటే హిందూసమాజమే ఉండేది కాదని, శివాజీ వందల కోటలు జయించి జ్యేష్ఠ శుద్ధ త్రయోదశి రోజు హిందూ సామ్రాజ్యాన్ని స్థాపించి గొప్ప వీరుడని ఆయన స్ఫూర్తి తో యువత పని చేయాలని అన్నారు. 1857 తొలి స్వాతంత్ర్య సంగ్రామం నుంచి అనేక మంది మహనీయులు చేసిన త్యాగాలు భారత జాతికి చిరస్థాయిగా నిలిచాయని తెలిపారు. ఝాన్సీ రాణి లక్ష్మీబాయి మాతృభూమి కోసం చివరి శ్వాస వరకు పోరాడిన వీరవనిత అని అన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ “ఆజాద్‌గానే జీవిస్తాను... ఆజాద్‌గానే మరణిస్తాను” అనే అచంచల దేశభక్తి సంకల్పం, వీర్ సావర్కర్ అండమాన్ సెల్యులార్ జైలులో అనుభవించిన అమానుష కష్టాలు దేశభక్తి ఎంత గొప్పదో నేటి యువతకు గుర్తు చేస్తున్నాయని పేర్కొన్నారు. అలాగే 1857 భారతీయుల మొదటి స్వాతంత్ర్య సంగ్రామ ఉద్యమ సమయంలో గ్రామాల మధ్య రొట్టెలను పంపిణీ చేస్తూ రహస్య సమాచారాన్ని చేరవేసిన సంఘటనలను ప్రస్తావిస్తూ, దేశభక్తి కోసం ప్రజలు ఎంత చాతుర్యంతో, ఎంత సమన్వయంతో పనిచేశారో వివరించారు. డాక్టర్ హెడ్గేవార్ బాల్యం -- ప్రతి యువకుడికి ఆదర్శం రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ కేశవ్ బలిరామ్ హెడ్గేవార్ చిన్ననాటి నుంచే దేశభక్తిని జీవిత లక్ష్యంగా ఎంచుకున్నారని వక్త తెలిపారు. బ్రిటిష్ రాణి పట్టాభిషేక సందర్భంగా పాఠశాలలో పంచిన మిఠాయిలను తిరస్కరించడం, “వందే మాతరం” నినాదాన్ని నిషేధించిన రోజుల్లోనే నిర్భయంగా ఆ నినాదం చేయడం వంటి సంఘటనలు ఆయన అచంచల దేశభక్తికి



నిదర్శనమని చెప్పారు. శ్రీరాముడు -- యువతకు శాశ్వత స్ఫూర్తి మర్యాద పురుషోత్తముడు శ్రీరాముడు ధర్మం, కర్తవ్యనిర్వహణ, త్యాగం, నాయకత్వానికి ప్రతిరూపమని, వ్యక్తిగత సుఖాల కంటే సమాజ శ్రేయస్సు, రాజధర్మాన్ని గొప్పగా భావించిన శ్రీరాముని జీవితం ప్రతి యువకుడు ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. యువతకు పిలుపు భారతదేశం ఒకప్పుడు ప్రపంచానికి విశ్వగురువుగా, అపార సంపద కలిగిన దేశంగా నిలిచిందని, అయితే అంతర్గత విభేదాలు, ఐక్యత లోపం కారణంగా విదేశీ పాలనను ఎదుర్కోవాల్సి వచ్చిందని వక్తలు పేర్కొన్నారు. అలాంటి పరిస్థితులు మళ్లీ రాకుండా ఉండాలంటే యువత చరిత్రను తెలుసుకుని, సంస్కృతిని గౌరవించి, సమాజ సేవలో ముందుండి, దేశ ఐక్యతకు కట్టుబడి పనిచేయాలని పిలుపునిచ్చారు. పాల్గొన్న యువకులు దేశం, సమాజం, సంస్కృతి పరిరక్షణకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించాలని సంకల్పం వ్యక్తం చేశారు. దేశం ముందు -- స్వార్థం తరువాత” అనే భావనతో ప్రతి యువకుడు ముందుకు సాగినప్పుడే భారతమాత వైభవం మరింత పెరుగుతుంది. సంఘటిత సమాజమే శక్తివంతమైన దేశానికి పునాది. మన చరిత్రను, ధర్మాన్ని గౌరవిద్దాం... మన సనాతన సంస్కృతిని కాపాడుకుందాం... సంఘ సమాజ కార్యంలో సమయమిచ్చి పని చేస్తూ దేశభక్తి నిర్మాణానికి, దేశాభివృద్ధికి మన వంతు సేవ అందిద్దాం అన్నారు. ఈ యువసాంఘీక్ కార్యక్రమంలో ఖండకార్యకారిణి, వివిధ గ్రామాల నుండి వచ్చిన 95 మంది స్వయం సేవకులు తదితరులు పాల్గొన్నారు.

# చతుర్దశి పర్వదినం పురస్కరించు కొని ప్రత్యేక పల్లకి సేవ..

### స్వామి వారికి పంచామృత అభిషేకం ఉచిత అమృత నిర్గుండి కశాయం వితరణ, ముడుపు సమర్పణ

వార్త మిర్రర్ జగిత్యాల ప్రతినిధి జూన్ 28

ఆదివారం భానువాసరే జ్యేష్ఠ మాసం శుక్ల పక్షం చతుర్దశి పర్వదినం సందర్భంగా శ్రీ సూర్య ధన్వంతరి ఉషా చాయ సమేత శ్రీ సూర్య నారాయణ స్వామి వారికి పంచామృత అభిషేకం సూర్య భగవానుని విశిష్టత : ఆదివారం --సూర్య భగవానుని ప్రత్యేక దినం ఆదివారం హిందూ సాంప్రదాయంలో సూర్య భగవానుని (సూర్యుని)కి అంకితమైన పవిత్రమైన రోజు. ఈ రోజు సూర్యదేవుని ఆరాధించడం వల్ల ఆరోగ్యము, ఆయుష్మానుభవం, విజయం, ధనం, ప్రసిద్ధి లభిస్తాయని విశ్వాసం ఉంది. తదియ పర్వదినం పురస్కరించుకొని జగిత్యాల పట్టణం లోని శ్రీ సూర్య ధన్వంతరి దేవాలయములో శ్రీ సూర్య భగవానుకి, ప్రత్యేక పూజల అనంతరం ప్రత్యేక పల్లకి సేవ నిర్వహించడం జరిగినది. తదనంతరం అమృత నిర్గుండి కశాయం ఉచిత వితరణ చేయడం జరిగినది. తదనంతరం సూర్య భగవాన్ కు భక్తులు ముడుపులు కట్టారు. ఇట్టి కార్యక్రమములో ఫౌండర్ అండ్ ఛైర్మెన్ డాక్టర్ వడ్ల గట్ట రాజన్న,



వర్కింగ్ ప్రెసిడెంట్ వొడ్నాల శ్రీనివాస్, మేనేజింగ్ ట్రస్టి గట్టు రాజేందర్, సహాయ కోశాధికారి గోపి, సహాయ కార్య దర్శి భారతాల రాజసాగర్, పెద్ది శ్రీనివాస్, యాంసాని శంకరయ్య, తాటిపల్లి ప్రవీన్ కుమార్, మహేందర్, పూర్ణచంధర్, హరీష్, అర్చకులు శ్రీహరి పాల్గొన్నారు.

# ఆర్యవైశ్య మహాసభలో కల్వకుర్తి నేతకు గౌరవం

### - గోలి శ్రీనివాస్ రెడ్డి చేతుల మీదుగా సన్మానం

కల్వకుర్తి, జూన్ 28 వార్త మిర్రర్ ప్రతినిధి:– తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ రాజకీయ కమిటీ రాష్ట్ర వైస్ చైర్మన్‌గా కల్వకుర్తి మాజీ ఎంపీపీ కొండూరు గోవర్ధన్ నియామకమయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ఫుడ్ కమిషన్ చైర్మన్ గోలి శ్రీనివాస్ రెడ్డి తన నివాసంలో గోవర్ధన్‌ను ఘనంగా సన్మానించారు. పలువురు నాయకులు గోవర్ధన్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, ఆయన సేవలు ఆర్యవైశ్య సమాజ అభివృద్ధికి మరింత ఉపయోగపడాలని ఆకాంక్షించారు. సమాజ సేవలో ఆయన మరింత చురుకైన పాత్ర పోషించాలని అభినందించారు. ఈ కార్యక్రమంలో కల్వకుర్తి మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సింగం విజయ్ గౌడ్, జిల్లా నాయకులు నాగులు నాయక్, మాజీ సర్పంచ్‌లు కృష్ణారెడ్డి, పవన్ కుమార్ రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



## ఉపాధ్యాయులకు ఘన సన్మానం చేసిన లాలపేట్ గడి స్కూల్ 1993.. 94 బ్యాచ్ పూర్వ విద్యార్థులు



సికింద్రాబాద్, జూన్ 28 (వార్త మిర్రర్): లాలాపేట్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల (గడి స్కూల్) 1993-94 విద్యా సంవత్సరానికి చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాల ఆవరణలో ఆత్మీయ సమ్మేళనాన్ని ఘనంగా నిర్వహించారు. దాదాపు మూడు దశాబ్దాల తర్వాత ఒకేచోట కలుసుకున్న పూర్వ విద్యార్థులు చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన అప్పటి ఉపాధ్యాయులను ముఖ్య అతిథులుగా ఆహ్వానించి శాలువాలు, పుష్పగుచ్ఛాలతో ఘనంగా సన్మానించారు. ఉపాధ్యాయుల సేవలను కొనియాడుతూ వారి ఆశీర్వాదాలు పొందడం తమ జీవితంలో మరపురాని అనుభూతిగా నిలిచిందని పూర్వ విద్యార్థులు తెలిపారు. గురువులు అందించిన క్రమశిక్షణ, విలువలు, విద్య తమ జీవిత విజయాలకు బలమైన పునాదిగా నిలిచాయని వారు పేర్కొన్నారు. ఉపాధ్యాయుల పట్ల తమ కృతజ్ఞతను వ్యక్తం చేస్తూ ఇలాంటి సమ్మేళనాలు గురు-శిష్య బంధాన్ని మరింత బలోపేతం చేస్తాయని అన్నారు. అనంతరం ఉపాధ్యాయులు మాట్లాడుతూ, సమాజంలో వివిధ రంగాల్లో ఉన్నత స్థానాలకు చేరుకున్న తమ శిష్యులను చూసి ఎంతో గర్వంగా ఉందన్నారు. విద్యార్థులు జీవితంలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షిస్తూ ఆశీర్వదించారు. ఈ ఆత్మీయ సమ్మేళనం పాత మధుర జ్ఞాపకాలను పునరుద్ధరించడంతో పాటు గురు-శిష్య బంధానికి ప్రతీకగా నిలిచిందని పాల్గొన్న పూర్వ విద్యార్థులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో 10వ తరగతి (1993--94 బ్యాచ్) పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం -- సహకరించిన సభ్యులు వెంకటేష్ యాదవ్, బాలకృష్ణ, శ్రీనివాస్, యాదవ్, కృష్ణారావు, సత్యనారాయణ, నాగరాజు, ప్రకాష్, మోహన్ చారి, వెంకటేశ్వర్లు, ఎస్. రమేష్, వి. మహేష్, రామ్‌చందర్, రాజేందర్, ఆత్రేయ, బాల్‌రాజ్, నాగేశ్, కృష్ణమూర్తి,బాబురావు, కిషోర్, వెంకట్ రెడ్డి, పవన్, ఎ. మహేష్,ఎన్. కిరణ్ కుమార్, తిరుపతి రెడ్డి, బి.ఎస్. యాదవ్, భీరప్ప, వేణుగోపాల్, మోహన్, వై.బి. శశికాంత్ తదితరులు పాల్గొన్నారు.

# 12వ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేయాలి

**-సీఐటియు డిమాండ్ -**




వార్త మిర్రర్ మందమర్రి జూన్ 28: 12వ జాతీయ వేతన ఒప్పందాన్ని వెంటనే అమలు చేస్తూ వేతన కమిటిని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తూ కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో జులై 1న చేపట్టనున్న ధర్నాను విజయవంతం చేయాలని సింగరేణి కాలరీస్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిప్యూటీ జనరల్ సెక్రెటరీ అల్లి రాజేందర్, బ్రాంచ్ అధ్యక్షులు సాంబారు వెంకటస్వామి లు కోరారు. ఆదివారం రామకృష్ణాపూర్ లోని యూనియన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన బ్రాంచ్ కమిటీ సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకు వచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను అడ్డుపెట్టుకొని కోలిండియా యాజమాన్యం ఏర్పాటు చేయాల్సిన 12వ జాతీయ వేతన కమిటీని ఆలస్యం చేయడం సరైనది కాదని వారు మండి పడ్డారు. గతంలోనే కోల్ ఇండియా యాజమాన్యంకు జాతీయ కార్మిక సంఘాలు చెప్పిన వినకపోవడం వల్ల బొగ్గు రంగాలకు చెందిన 4 ఫెడరేషన్ లు ఇచ్చిన పిలుపుమేరకు జులై 1న కొత్తగూడెంలోని సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు జేఏసీ ఆధ్వర్యంలో జరిగే ధర్నాలో కార్మికులు అధిక సంఖ్యలో తరలి వచ్చి విజయవంతం చేయాలని కోరారు. భారతదేశంలో ఏ ప్రభుత్వ రంగ సంస్థలలో నాలుగు లేబర్ కోడ్ లు అమలు చేయకుండా కేవలం బొగ్గు రంగ సంస్థలలో లేబర్ కోడ్ లను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశాలు ఇవ్వడం సరైనది కాదన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం కోల్ ఇండియా యజమాన్యం 12వ జాతీయ వేతన ఒప్పందం కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని లేదంటే భవిష్యత్తులో మరిన్ని పోరాటాలు చేయక తప్పదని వారు హెచ్చరించారు . లేబర్ కోడ్ లను బొగ్గు రంగంలో అమలు చేయడాన్ని వ్యతిరేకించిన బిఎంఎస్, వేతన ఒప్పందం కమిటీని డిమాండ్ చేస్తూ నాలుగు ఫెడరేషన్ల యూనియన్లతో కలిసి రాకుండా ఒంటరిగా ఆందోళనలు చేయడం సరైనది కాదని అన్ని యూనియన్లతో కలిసి డిమాండ్ డే లో పాల్గొని ఐక్య పోరాటాలకు మరింత బలం ఇవ్వాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ ఉపాధ్యక్షులు జడల ప్రవీణ్, నామని సురేష్, అసిస్టెంట్ సెక్రటరీ ధనిశెట్టి సురేష్, ఏరియా ఆర్గనైజర్ బాసబోయిన కుమారస్వామి, పిట్ సెక్రటరీలు నాగవెల్లి శ్రీధర్, పసునూటి శ్రీకాంత్, హరీష్, మహమ్మద్ తాజ్ లు పాల్గొన్నారు.

## దేశ ఆర్థిక సంస్కరణలకు పునాది వేసిన మహానేత పి.వి.: ప్రభాకర్ రావు



సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 28 : భారత మాజీ ప్రధానమంత్రి, భారతరత్న పాములపర్తి వెంకట నరసింహారావు 105వ జయంతి సందర్భంగా ఆదివారం హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని పి.వి. ఘాట్ వద్ద ఘనంగా నివాళులర్పించారు. పి.వి. కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, సీనియర్ పాత్రికేయులు, సామాజిక కార్యకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని మహానేతకు పుష్పాంజలి ఘటించారు. ఈ కార్యక్రమానికి పి.వి. గ్లోబల్ ఫౌండేషన్ చైర్మన్, తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీవైజేఎఫ్) చాంబర్స్ కమిటీ చైర్మన్, పి.వి. నరసింహారావు కుమారుడు పి.వి. ప్రభాకర్ రావు ముఖ్య అతిథిగా హాజరై తన తండ్రి సమాధి వద్ద పుష్పగుచ్ఛం ఉంచి ఘన నివాళులర్పించారు. అనంతరం తెలంగాణ యూత్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు డా. జితేందర్ రావు తనుగుల, ఎం. హరి బాబు తదితరులతో కలిసి మహానేతకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా పి.వి. ప్రభాకర్ రావు మాట్లాడుతూ, పి.వి. నరసింహారావు మరణించి ఎన్నో సంవత్సరాలు గడిచినా ప్రజల హృదయాల్లో ఆయనకు ఉన్న గౌరవం, ఆదరణ ఏమాత్రం తగ్గలేదన్నారు. దేశ ఆర్థిక సంస్కరణలకు శ్రీకారం చుట్టి భారతదేశాన్ని అభివృద్ధి పథంలో నడిపించిన దూరదృష్టి కలిగిన నాయకుడిగా ఆయన చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతారని పేర్కొన్నారు. నిజాయితీ, నిస్వార్థ ప్రజాసేవ, సమర్థ పరిపాలన, దూరదృష్టి వంటి పి.వి. విలువలు నేటి తరానికి ఆదర్శమని, యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ, ఆర్థిక, విద్యా, విదేశాంగ, పరిపాలనా రంగాల్లో పి.వి. నరసింహారావు అందించిన సేవలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆధునిక భారత నిర్మాణంలో ఆయన పోషించిన పాత్ర చారిత్రాత్మకమని, దేశాభివృద్ధికి ఆయన చూపిన మార్గం భావితరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో పి.వి. కుటుంబ సభ్యులు, ప్రజాప్రతినిధులు, రాజకీయ నాయకులు, సీనియర్ జర్నలిస్టులు, సామాజిక కార్యకర్తలు, వివిధ సంస్థల ప్రతినిధులు, అభిమానులు పాల్గొని మహానేతకు ఘనంగా నివాళులర్పించారు. పి.వి. ఆశయాలను ముందుకు తీసుకెళ్లేందుకు కృషి చేయాలని ఈ సందర్భంగా సంకల్పించారు.

## పల్స్ పోలియోతో పాటు ఓటరు నమోదు కార్యక్రమంలోనూ జింకల మల్లేష్ చురుకైన భాగస్వామ్యం





సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 28: ప్రజారోగ్య పరిరక్షణతో పాటు ప్రజాస్వామ్య వ్యవస్థ బలోపేతానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని బీఆర్ఎస్ గ్రేటర్ హైదరాబాద్ నాయకుడు జింకల మల్లేష్ అన్నారు. జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం తార్నాక నాగార్జున నగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన జింకల మల్లేష్ ఐదేళ్లలోపు చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలియో నిర్మూలనలో ప్రతి తల్లిదండ్రి బాధ్యతాయుతంగా వ్యవహరించి తమ పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని కోరారు. ప్రజారోగ్య పరిరక్షణలో ప్రభుత్వ కార్యక్రమాలకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అనంతరం ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా తార్నాక డివిజన్‌లో ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ఓటరు నమోదు, సవరణ, మార్పులు, చేర్పులకు సంబంధించిన దరఖాస్తు పత్రాలను పంపిణీ చేశారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవడంతో పాటు తమ ఓటరు వివరాలను సరిచూసుకుని అవసరమైన సవరణలు చేసుకోవాలని ఆయన సూచించారు. బలమైన ప్రజాస్వామ్య నిర్మాణానికి ప్రతి ఓటు ఎంతో విలువైనదని పేర్కొన్నారు. ఈ ఈ కార్యక్రమం లో బీఆర్ఎస్ సీనియర్‌నాయకులుగుండెల్లి మధుకర్, జోగు రాకేష్, అరుణ్ కుమార్ పాల్గొన్నారు.


## పోలియో రహిత సమాజ నిర్మాణానికి సహకరించాలి: మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి




సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 28: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా ఆదివారం లాలాపేట్ ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమంలో తార్నాక మాజీ కార్పొరేటర్ ఆలకుంట సరస్వతిహరి పాల్గొని చిన్నారులకు పోలియో చుక్కలు వేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, పోలియో చిన్నారులను శాశ్వత వికలాంగులుగా మార్చే ప్రమాదకరమైన వ్యాధి అని, దాని నిర్మూలనకు పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. గతంలో పోలియో చుక్కలు వేసినా, ప్రభుత్వం నిర్వహించే ప్రతి విడత పల్స్ పోలియో కార్యక్రమంలో మళ్లీ చుక్కలు వేయించడం అవసరమని తెలిపారు. దీనివల్ల చిన్నారుల్లో వ్యాధి నిరోధక శక్తి మరింత పెరిగి, పోలియో వైరస్ వ్యాప్తిని పూర్తిగా అరికట్టేందుకు దోహదపడుతుందని వివరించారు."ప్రతి చిన్నారికి రెండు చుక్కలు -- పోలియో రహిత భారతదేశం మనందరి లక్ష్యం" అనే సందేశాన్ని ప్రతి ఇంటికి తీసుకెళ్లాలని ఆమె పిలుపునిచ్చారు. తల్లిదండ్రులందరూ బాధ్యతగా వ్యవహరించి తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి తోడ్పడాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది, ఆరోగ్య శాఖ సిబ్బంది, బీఆర్ఎస్ కార్యకర్తలు నాగరాజు గౌడ్, మల్లికార్జున్, నాగు, రఘు తదితరులు పాల్గొన్నారు.:::

## లయన్స్ క్లబ్ చౌటుప్పల్ ఆధ్వర్యంలో పేద విద్యార్థినిలకు సైకిళ్లు పంపిణీ..

### లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల్ సేవ అధ్యక్షులు. తిరందాసు జగన్నాథ్





వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 28

విద్యార్థినిలు, విద్యను సులభంగా కొనసాగించేందుకు పాఠశాలలకు రాకపోకలలో ఇబ్బందులు ఎదుర్కొంటున్న పేద విద్యార్థినిలకు లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవా ఆధ్వర్యంలో సైకిల్ పంపిణీ కార్యక్రమం ఆదివారం రోజున చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని లైన్స్ భవన్ నందు, లైన్స్ క్లబ్ సభ్యులు దాచేపల్లి రాజు సహకారంతో నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా క్లబ్ ప్రతినిధులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని పేద విద్యార్థులు దూర ప్రాంతాలకు నడిచి వెళ్లాల్సిన పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని ఈ సేవా కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. సైకిళ్లు విద్యార్థినుల చదువుకు ఎంతో ఉపయోగపడతాయని వారి విద్యాభ్యాసాన్ని మరింత ప్రోత్సహిస్తాయని అన్నారు. సైకిళ్లు అందుకున్న విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, లైన్స్ క్లబ్ చౌటుప్పల సేవా సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో లైన్స్ క్లబ్ ఆఫ్ చౌటుప్పల సేవా చారిటబుల్ ట్రస్టు చైర్మన్ దాచేపల్లి ప్రకాష్ గుప్తా, కార్యదర్శి అతహర్ పాషా, కోశాధికారి సిలివేరు మంగయ్య, క్లబ్ జిల్లా కమిటీ సభ్యులు గోశిక కరుణాకర్, ఉప్పు ఆంజనేయులు, కాసుల వెంకటేశం, వేముల నరసింహ, చింతల ప్రభాకర్ రెడ్డి, పాల్గొనడం జరిగింది..

## సెవెన్ హిల్స్ రెసిడెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏకగ్రీవంగా ఎన్నిక

### 19 ఏళ్ల నుండి కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షులుగా కత్తుల రాంబాబు ఎకగ్రీవంగా ఎన్నిక



ఎల్బీనగర్, 28 జూన్:మన్సురాబాద్ డివిజన్ పరిధిలోని సెవెన్ హిల్స్ కాలనీ సంక్షేమ సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంక్షేమ సంఘం భవనంలో ఏర్పాటుచేసిన కార్యవర్గ సమావేశంలో అధ్యక్షులుగా కత్తుల రాంబాబును 2007 నుండి నేటి వరకు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో పాటు పూర్తిస్థాయి కమిటీని ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా కత్తుల రాంబాబు, ప్రధాన కార్యదర్శిగా కిషోర్ బాబు, జాయింట్ సెక్రెటరీ బోగోజు మధు, ట్రెజరర్ శేఖర్ గౌడ్ , ఉపాధ్యక్షులుగా వెంకటేష్, ప్రవీణ్, సాయి కృష్ణ, కార్యవర్గ సభ్యులుగా సరస్వతి, స్రవంతి, రమేష్, అజయ్, సతీష్, వెంకటేశ్వర్లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా కత్తుల రాంబాబు మాట్లాడుతూ 2007 నుండి నేటి వరకు మేలుగా తనను కాలనీ అధ్యక్షులుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటున్న కాలనీ సంక్షేమ సంఘం నాయకులకు, కాలనీ ప్రజలకు, మహిళలకు, యువకులకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా పనిచేస్తూ సమస్యలు లేని కాలనీగా తీర్చిదిద్దడానికి శాయశక్తుల కృషి చేస్తానని కత్తుల రాంబాబు కాలనీ ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో కాలనీ సంక్షేమ సంఘం సభ్యులు రామ్మోహన్, శోభన్, రాంప్రసాద్, సైదులు, కార్తీక్, పాల్గొన్నారు.



## లాలపేట్ లో పల్స్ పోలియో విజయవంతానికి కాంగ్రెస్ నాయకుల కృషి

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 28: జాతీయ పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా లాలాపేట్ మున్సిపల్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన పోలియో కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చిన్నారులకు పోలియో చుక్కలు వేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, పోలియో రహిత భారత నిర్మాణానికి ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు వేయించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆరోగ్య శాఖ చేపడుతున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజలు విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు కిషోర్ యాదవ్, భరమాజీ, రవి, శేఖర్ గౌడ్, ప్రసాద్, అన్వర్ తదితరులు పాల్గొన్నారు.



## తెలంగాణ వంజరి సంఘం ఎన్నికలకు ఎన్నికల కమిటీ ఏర్పాటు

సికింద్రాబాద్, వార్త మిర్రర్ జూన్ 28:

తెలంగాణ వంజరి సంఘం ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన రాష్ట్రస్థాయి సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నికలను నిర్వహించేందుకు ఎన్నికల కమిటీని ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి ప్రతినిధులు హాజరై ఎన్నికల నిర్వహణపై విస్తృతంగా చర్చించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాలేరు నరేందర్ మాట్లాడుతూ, సంఘాన్ని మరింత బలోపేతం చేసి కులాభివృద్ధికి కృషి చేయాలంటే పారదర్శకంగా, ఐకమత్యంతో ఎన్నికలు నిర్వహించడం అవసరమన్నారు. కులస్థులందరూ ఎన్నికల ప్రక్రియకు సహకరించి సంఘ అభివృద్ధికి తమవంతు బాధ్యత నిర్వర్తించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ప్రధాన కార్యదర్శి కందారి వెంకటేశం మాట్లాడుతూ సంఘం బలోపేతమే లక్ష్యంగా నూతన కార్యవర్గం ఎన్నికలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఎన్నికల కమిటీ సభ్యులు నిష్పాక్షికంగా ఎన్నికల ప్రక్రియను నిర్వహిస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో కోశాధికారి అమరేందర్, విశ్వనాథం, విజయ్ కుమార్, ఆంజనేయులు, వంజరి ప్రవీణ్, సత్యం, అర్జున్, కోటేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

## పల్స్ పోలియో ప్రతి బిడ్డకు రక్షణ కవచం

### మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదల పావని రమేష్ గౌడ్



వార్త మిర్రర్ చౌటుప్పల్ ప్రతినిధి జూన్ 28

పోలియో రహిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వామ్యం కావాలని, ఐదేళ్ల లోపు పిల్లలందరికీ తల్లిదండ్రులు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని బస్టాండ్ ఆవరణలో 'దివిస్' సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పల్స్ పోలియో కేంద్రంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. చిన్నారులకు డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ సుమన్ కళ్యాణ్ తో కలిసి ఆమె స్వయంగా పోలియో చుక్కలు వేసి ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ పల్స్ పోలియో ప్రతి బిడ్డకు రక్షణ కవచం లాంటిదన్నారు. చౌటుప్పల్ మండలం, మున్సిపల్ పరిధిలోని అన్ని గ్రామాల వ్యాప్తంగా ఉన్న ఐదేళ్ల లోపు పిల్లలందరికీ ఈ చుక్కల మందు వేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమాన్ని తంగడపల్లి పీహెచ్‌సీ డాక్టర్ చింతకింది కాటంరాజు ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. పోలియో కేంద్రాల్లో విధుల్లో ఉన్న హెల్త్ స్టాఫ్‌కు అల్పాహారం, సిబ్బందికి వాహన సదుపాయం, పోలియో వ్యాక్సిన్ బాక్సులను సెంటర్లకు చేరవేయడం వంటి అన్ని సౌకర్యాలను కల్పించిన 'దివిస్' సంస్థ యాజమాన్యానికి ఆమె ప్రత్యేక అభినందనలు తెలిపారు. తమ సంస్థ తరఫున అవసరమైన అన్ని సామాగ్రిని, రవాణా సౌకర్యాలను సమకూర్చినట్లు వివరించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని పిల్లలను ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ గోశిక వినయ్, స్థానిక కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, పాక చిరంజీవి, ఊడుగు జ్యోతి రమేష్ గౌడ్, ఎండి హన్ను, చింతల ఉమామహేశ్వరి సాయిలు,, బత్తుల జయమ్మ దాస్, దివిస్ ప్రతినిధులు బి. గోపి, జి. వెంకటేశ్వర్లు, వి. వంశీకృష్ణ, జె. శివకృష్ణ, వైద్య సిబ్బంది, ఆశా వర్కర్లు, చిన్నారుల తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు..